ఉత్తీర్ణత తగ్గినా..

గతంతో పోలిస్తే తగ్గిన ఉత్తీర్ణత శాతం • ప్రతిభ చూపిన విద్యార్థులు

జీవీఎంసీ పాఠశాలల 10వ తరగతి ఫలితాల తీరిది

నియోజకవర్గంలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం తగ్గింది. అయినప్పటికీ పలు పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి వ్యక్తిగత ప్రతిభను కనబరిచారు.
ఉత్తీర్ణత శాతం తగ్గుదలకు గల కారణాలపై విశ్లేషణ అవసరమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

గత, ప్రస్తుత విద్యా సంవత్సరాల ఉత్తీర్ణత శాతాలు ఇలా ఉన్నాయి.

పాఠశాల పేరు	2023-24 ఉత్తీర్ణత శాతం	2024-25 ఉత్తీర్ణత శాతం
మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్	90	88
ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్	81	79
మాధవధార ఉన్నత పాఠశాల	87	72
కే కాలనీ పాఠశాల	86	82
కేఎన్ఎం గర్ల్స్ హైస్కూల్	95	89
రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ హైస్కూల్	72	60
కప్పరాడ ఉన్నత పాఠశాల	92	83.05
ఎన్ఎంసీహెచ్ పాఠశాల	75	63.69

మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో..


సాయి సంపత్ (583)


యజస్వి దుర్గా సంతోషి (575)


దామోదర్ యాదవ్ (574)

సీతంపేట: 10వ తరగతి ఫలితాల్లో మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల నుంచి 88 మంది విద్యార్థులు 10 పరీక్షలకు హాజరు కాగా.. ఒకరు గైర్హాజరయ్యారు. 78 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 64 మంది ప్రథమ శ్రేణి, 11 మంది ద్వితీయ శ్రేణి, ముగ్గురు తృతీయ శ్రేణిలో పాసయ్యారు. పాఠశాలకు చెందిన పి.సాయి సంపత్ 583 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. ఎం.యజస్వి దుర్గా సంతోషి 575, కె.దామోదర్ యాదవ్ 574 సాధించగా, మొత్తంగా 24 మంది 500 పైగా మార్కులు సాధించారు. విద్యార్థులను ఎంఈవోలు రామారావు, బాలామణి, హెచ్ఎం శాంతికుమారి అభినందించారు. కాగా.. గతేడాది ఈ పాఠశాల 90 శాతం ఉత్తీర్ణత నమోదు చేసింది.


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ టాపర్స్‌ను అభినందిస్తున్న ఎంఈవోలు రామారావు, బాలామణి

కేఎన్ఎం గర్ల్స్ హైస్కూల్‌లో..


చంద్రహాసిని (570)

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని కేఎన్ఎం గర్ల్స్ హైస్కూల్ నుంచి మొత్తం 66 మంది 10 తరగతి పరీక్షలకు హాజరు కాగా.. 59 మంది ఉత్తీర్ణులయ్యారు. 89 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీరిలో 44 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. పి.చంద్రహాసిని 570 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. కాగా.. గతేడాది ఇక్కడ 95 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

జీవీఎంసీ హైస్కూల్‌లో..


సాధన(571)

రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ హైస్కూల్ నుంచి మొత్తం 55 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 33 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎస్.సాధన 571 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. గతేడాది ఇక్కడ 72 శాతం ఉత్తీర్ణత నమోదు కావడం గమనార్హం.

ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో..


కుదిరెల్ల సతీష్ (577)


దినేష్ (576).


మౌనిక (571)

అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు 79 ఉత్తీర్ణత సాధించారు. స్కూల్ నుంచి మొత్తం 122 మంది పరీక్షలకు హాజరు కాగా.. 96 మంది ఉత్తీర్ణులయ్యారు. కుదిరెల్ల సతీష్ 577 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచాడు. అమలాపురపు దినేష్ 576, పిల్లిబోని మౌనిక 571, బడే యామిని శ్రీజ 550, దారపు త్రిష 550, అంకిత కుమారి 548, సాహిద ప్రవీణ్ 522, మారోతి జయ మోక్షజ్ఞ 516, పాట్నూరు దివ్య ధాత్రి 516, చింతలపూడి మౌనిక 513, దామిశెట్టి ప్రభుదేవ్ 510, సిగడ హారిక 508, నందం రేణుక 507, బొత్స నరసింహ 500 మార్కులు సాధించారు. మొత్తంగా 14 మంది 500 పైబడి మార్కులు సాధించారు. కాగా.. గతేడాది ఈ పాఠశాల 81 శాతం ఉత్తీర్ణత నమోదు చేసింది.

మాధవధార ఉన్నత పాఠశాలలో..


హర్షిణి (587)


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం హేమలత

మురళీనగర్: మాధవధార ఉన్నత పాఠశాల నుంచి 155 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 112 మంది పాసయ్యారు. 72 శాతం ఫలితాలు సాధించారు. గతేడాది ఇదే పాఠశాలలో 87 శాతం ఫలితాలు వచ్చాయి. అంతే కాకుండా జీవీఎంసీ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన రికార్డును ఈ పాఠశాల నమోదు చేసింది. గత ఏడాది తెలుగు మీడియం విద్యార్థులు పరీక్షలు రాయగా.. ఈ ఏడాది అందరూ ఇంగ్లిష్ మీడియంలోనే రాశారు. ఈ ఏడాది బాలురు 75 మందికి 51 మంది, బాలికలు 80 మందికి 61 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 85 మంది ప్రథమ శ్రేణి, 20 మంది ద్వితీయ శ్రేణి, ఐదుగురు తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. నొట్ల హర్షిణి అత్యధికంగా 587 మార్కులు సాధించింది. 500కు పైబడి 29 మంది, 550కు పైబడి 8 మంది ఉన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను హెచ్ఎం బి.హేమలత అభినందించారు.

జ్ఞాననికేతన్ పాఠశాలలో..


జ్ఞాననికేతన్ ఎయిడెడ్ పాఠశాల టాపర్స్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ సునీత కుమారి

అక్కయ్యపాలెంలోని జ్ఞాననికేతన్ ఎయిడెడ్ పాఠశాలలో 92 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాల నుంచి 159 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 138 మంది ఉత్తీర్ణత సాధించారు. డి.చరణ్ సాయి 591 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచాడు. టి.కుమార్ 584, ఎల్.విష్ణు ప్రియ 581, ఎల్.సాయి చైతన్య 578, జి.జ్యోతిక 572, ఎం.వసంత్‌కుమార్ 570, ఎ.ప్రియాంక 570, పల్లా సాయి 560, జె.రాధిక 559, కె.తేజ 552 మార్కులు సాధించారు. మొత్తంగా 42 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. స్కూల్ కరస్పాండెంట్ సునీత కుమారి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

కె.కాలనీ పాఠశాలలో..


పల్లవి(560)

కే కాలనీ పాఠశాల నుంచి 99 మంది పరీక్షలకు హాజరు కాగా.. వీరిలో 81 మంది ఉత్తీర్ణులయ్యారు. 82 శాతం ఫలితాలు సాధించారు. గత ఏడాది ఇదే పాఠశాలలో 117 మందికి 101 మంది పాసై 86 శాతం ఫలితాలు సాధించడం గమనార్హం. ఈ ఏడాది బాలురు 49 మందికి 41 మంది, బాలికలు 50 మందికి 40 మంది ఉత్తీర్ణులయ్యారు. బి.పల్లవి అత్యధికంగా 560 మార్కులు సాధించింది. సీహెచ్ గాయత్రి (539), జె.దీపిక (536), ఎన్.అరుణ జ్యోతి (532), ఎ.గణేష్ (527), ఎం.శ్రీరమణి (519), ఎం.సుమంత్ 507 మార్కులు సాధించినట్లు హెచ్ఎం ఎస్ఎస్ఎం సాయిలక్ష్మి తెలిపారు. విద్యార్థులను ఆమె అభినందించారు.

ఐపీఎస్ అవుతా..



టెన్త్‌లో 560 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఎక్కువ మార్కులు సాధించగలిగాను. పాలిటెక్నిక్‌లో జాయిన్ అవుతాను. మూడేళ్ల డిప్లమో చేస్తాను. తర్వాత ఇంజినీరింగ్‌లో చేరతాను. తర్వాత సివిల్స్‌కు ప్రిపేర్ అవుతాను.

– శృతి బిసాయి, పీఅండ్ టీకాలనీ

కప్పరాడ పాఠశాలలో..


ఢిల్లేశ్వరికి స్వీట్ తినిపిస్తున్న హెచ్ఎం విజయమాలిని

కంచరపాలెం: 10వ తరగతి ఫలితాల్లో ఐటీఐ జంక్షన్‌లోని జీవీఎంసీ కప్పరాడ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.ఢిల్లేశ్వరి 569 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. 22 మంది విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించారని హెచ్ఎం వి.విజయమాలిని తెలిపారు. పాఠశాల నుంచి 118 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 98 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 83.05 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 92శాతం ఉత్తీర్ణత నమోదైన సంగతి తెలిసిందే. విద్యార్థులను హెచ్ఎం అభినందించారు.

హరగోపాల్ విద్యార్థుల విజయదుందుభి


స్కూల్ టాపర్స్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్రావు నాయుడు

తాటిచెట్లపాలెం: 10వ తరగతి ఫలితాల్లో రైల్వే న్యూకాలనీలోని హరగోపాల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ స్కూల్ నుంచి మొత్తం 121 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 120 మంది ఉత్తీర్ణులయ్యారు. 85 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. డి.గౌతమ్ కుమార్ 594 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. కె.భావన లక్ష్మి 590 సాధించింది. మరో 16 మంది విద్యార్థులు 580పైగా మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శంకర్రావు నాయుడు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

ఎన్ఎంసీహెచ్‌లో...


శృతి బిసాయికి మిఠాయి తినిపిస్తున్న హెచ్ఎం రామ్‌ప్రసాద్

సీతమ్మధార: పీఅండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ పాఠశాల 63.69 శాతం ఉత్తీర్ణత నమోదుచేసినట్లు హెచ్ఎం డి.రామ్‌ప్రసాద్ తెలిపారు. పాఠశాలకు చెందిన శృతి బిసాయి 560 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. పాఠశాల నుంచి 168 మంది పరీక్షలు రాయగా.. 107 మంది పాసయ్యారు. ఫస్ట్‌క్లాస్ 55 మంది, సెకండ్‌క్లాస్‌లో 36 మంది, థర్డ్‌క్లాస్‌లో 16 మంది ఉత్తీర్ణులైనట్లు హెచ్ఎం వివరించారు. ఈ సందర్భంగా శృతికి హెచ్ఎం మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. కాగా.. గతేడాది ఈ పాఠశాల 75శాతం ఉత్తీర్ణత నమోదైన సంగతి తెలిసిందే.

క్లుప్తంగా

రాంజీ ఎస్టేట్ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని వినతి


డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు

కంచరపాలెం: కంచరపాలెం పరిధిలోని కొండవాలు ప్రాంతం రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి ఉన్నత పాఠశాలగా మార్చాలని కోరుతూ బీజేపీ నాయకుడు గుణుపూడి అరుణ్‌బాబు, స్థానికులు బుధవారం డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. దీంతో ఆయన రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు వినతులు అందించారు. తమ పిల్లలు ఉన్నత చదువులకు జాతీయ రహదారి దాటి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా డీఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సమస్యను కలెక్టర్, ఆర్జేడీకు నివేదిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం దొరబాబు, వార్డు అధ్యక్షురాలు జి.అరుణ, ఇన్‌చార్జి రాజారావు, చిన్నా, సంఘం అధ్యక్షుడు కనకరాజు, శంకరరావు, అంబేడ్కర్ ఎస్టేట్ గ్రామ పెద్దలు సవరపు జయకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఎంసీహెచ్ ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు



బెండి ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సీతమ్మధార: పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ పాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు బెండి ప్రసాద్‌కు ఘనంగా సత్కారం జరిగింది. మేలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో బుధవారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం బి.రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రసాద్, విజయలక్ష్మి దంపతులను శాలువా, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ బెండి ప్రసాద్ వంటి అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులు అరుదుగా ఉంటారని కొనియాడారు. ఉపాధ్యాయులంతా ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బెండి ప్రసాద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బంది, ఉపాధ్యాయుల సహకారం మరువలేనిదన్నారు. ఆయన ఎన్ఎంసీహెచ్ పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార: గంజాయి అక్రమంగా తరలిస్తున్న యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి.. తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఏజెన్సీలో కొనుగోలు చేసిన నాలుగు కిలోల గంజాయిని స్వస్థలానికి తీసుకెళ్లేందుకు విశాఖ చేరుకున్నారు. కాగా.. రామాటాకీస్ వద్ద ట్రావెల్స్ బస్సులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో నిందితులు జె.దామోదరన్, సత్యనారాయణ వెంకటేష్ వద్ద నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ద్వారకా పోలీసులకు అప్పగించారు. ద్వారకా సీఐ డి.వి.రమణ పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తు జరుగుతోంది.

పర్యాటకులపై ఉగ్రవాద దాడి హేయం

దాబాగార్డెన్స్: జమ్ము కశ్మీర్ పహల్గాం పర్యాటక ప్రాంతంలో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి హేయమని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) అధ్యక్షుడు వి రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హింసాత్మక సంఘటనలో 26 మంది అమాయకుల ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని కోరారు. అమానుష చర్యకు పాల్పడిన నేరస్తులను త్వరగా గుర్తించి, చట్టం ముందుకు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

సీతమ్మధార: పహల్గాం ఉగ్రదాడిని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రతినిధులు ఖండించారు. ఆశీలమెట్ట జీవీఎంసీ ఎదురుగా గల గాంధీపార్కులో బుధవారం సాయంత్రం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్ మాట్లాడుతూ ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. ఘటనకు కారణమైన మతోన్మాద ఉగ్రవాదులను నడిరోడ్డుపై కాల్చి చంపాలన్నారు.

కాసుల వేటలో పోలీసులు?

- నాలుగవ పట్టణ క్రైం పోలీస్‌స్టేషన్ సిబ్బందిపై ఆరోపణలు
- ముడుపుల బెడదతో ఫిర్యాదుదారుల ఆందోళన


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్

సీతమ్మధార: నగరంలోని నాలుగవ పట్టణ క్రైం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోనే కీలకమైన ఈ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఫిర్యాదుదారుల నుంచి లంచాలు డిమాండ్ చేస్తున్నారని ప్రచారం ఉంది. స్టేషన్ పరిధిలో తరచూ చోరీలు, దొంగతనాలు జరుగుతుండటంతో నిత్యం ఫిర్యాదుదారులు స్టేషన్‌కు వస్తుంటారు. ఈ స్టేషన్‌లో ఎస్ఐ పర్యవేక్షణలో ఒక ఏఎస్ఐ, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, 10 మంది కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 5న క్రైం ఎస్ఐగా రామ్మోహనరావు బాధ్యతలు స్వీకరించారు. కాగా.. ఇటీవల ఒక కేసులో నిందితురాలిగా ఉన్న ఒక వృద్ధురాలి నుంచి పోలీసులు రూ.4 వేలు లంచం డిమాండ్ చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ డబ్బు చెల్లించడంతో ఆమె కేసు నుంచి విముక్తి పొందారని సమాచారం. చిన్నా, చితకా చోరీలకు సంబంధించి ఈ స్టేషన్ పరిధిలో దాదాపు 28 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు, మోటార్ వాహనాల చోరీ కేసుల విషయంలో ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. కేసు పరిష్కారం అవుతుందో లేదో గానీ, ముడుపుల బెడద మాత్రం తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేసు తీవ్రతను బట్టి రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లించాల్సి వస్తుందని, లేని పక్షంలో కింది స్థాయి సిబ్బంది స్టేషన్ చుట్టూ పదేపదే తిప్పిస్తున్నారని వాపోతున్నారు. ఫిర్యాదుదారులతో పాటు కేసుల్లో అనుమానితుల నుంచి కూడా పోలీసులు గట్టిగానే డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిందితులుగా పేర్కొని భయభ్రాంతులకు గురిచేసి, కేసుల నుంచి తప్పించుకోవడానికి డబ్బులు చెల్లించేలా చేస్తున్నారని సమాచారం. ఈ విషయంపై 'సాక్షి' ఈస్ట్ సర్కిల్ క్రైం ఏడీసీపీ మోహనరావును సంప్రదించగా.. ఈ వ్యవహారంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ స్టేషన్‌లో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తనకు నేరుగా ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ రద్దు చేయాలి

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ రద్దు నిర్ణయాన్ని కేంద్రం పార్లమెంటులో ప్రకటించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి .పద్మ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపి, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1,475వ రోజుకి చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చి, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్ర పన్నిందన్నారు. ఈ కుట్రను టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీ డబ్బును ప్లాంట్ ఉత్పత్తికి, యంత్రాలకు, ముడి సరకులకు, కార్మికుల జీతభత్యాలకు చెల్లించకుండా రూ.1140 కోట్లు బ్యాంకు అప్పులు చెల్లించారని తెలిపారు. ఇందులోనే రూ. 500 కోట్లు జీఎస్టీ పేరుతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుని, రూ.6700 కోట్లు ఇతర అప్పులు తీర్చగా మిగిలింది 3 వేల కోట్లు అని వివరించారు. స్టీల్‌ప్లాంట్‌లో 1100 మంది పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపుతున్నారని, కాంట్రాక్ట్ కార్మికులను 5,400 మందిని తొలగించేందుకు సిద్ధపడ్డారని అన్నారు. ఇప్పటికే 960 మంది పాసులు రెన్యువల్ చేయకుండా, విధులకు హాజరు కాకుండా నిలిపి వేశారని తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులందరినీ విధుల్లో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఐద్వా జిల్లా నాయకులు కె.మణి, కె.కుమారి, బొట్టా ఈశ్వరమ్మ, వి.ప్రభావతి, ఎల్.కామేశ్వరి, స్వర్ణలత పాల్గొన్నారు.

కె.కె.రాజుకు శుభాకాంక్షల వెల్లువ


కె.కె.రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గంటా కామరాజు తదితరులు


కె.కె.రాజును అభినందిస్తున్న సంపంగి శ్రీనివాసరావు, సంతోష్


కె.కె.రాజును అభినందిస్తున్న ఫరూఖీ, మార్కండేయులు, వెంకటలక్ష్మి తదితరులు

సీతంపేట: వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కె.కె.రాజును పలువురు పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సింహాచలం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఉత్తర అధ్యక్షుడు సారిపిల్లి సంతోష్, ముప్పల సంతోష్, భోగవిల్లి గోవింద్ తదితరులు కె.కె.రాజును శాలువాతో సత్కరించి అభినందించారు. అలాగే వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఐ.హెచ్.ఫరూఖీ, విశాఖ జిల్లా పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు, కార్పొరేటర్ బర్కత్ ఆలీ, కె.వి.బాబా, 26వ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, మైనార్టీ నాయకులు భాషా, మక్బూల్, కరీం తదితరులు కె.కె.రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

కె.కె.రాజుకు అభినందనలు

కంచరపాలెం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కె.కె.రాజుకు జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గంటా కామరాజు, భార్గవ్ కుమార్ అభినందనలు తెలిపారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందించారు. వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన


శాంతినగర్‌లో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం శాంతినగర్ వద్ద జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ నేతృత్వంలో కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. రూ.1.98కోట్లతో సామాజిక భవన నిర్మాణం చేపడుతున్నట్లు డిప్యూటీ మేయర్ తెలిపారు. ఈఈ దిలీప్‌కుమార్, ఏఈ వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జాగారపు నరేష్, స్థానిక నాయకులు గొర్లె చందు, సేనాపతి అప్పారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 48వ వార్డు బర్మాక్యాంప్ జై భారత్‌నగర్‌లో శానిటరీ కార్యాలయం, వెయింట్ హాల్‌ను బుధవారం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. రూ.75.95 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ గంకల కవిత తెలిపారు.

49వ వార్డు పరిధిలో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 49వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. వార్డు పరిధిలోని రైల్వే సొసైటీ లేఅవుట్–కామాక్షి నగర్ బి.టిరోడ్డును 29.70 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్నారు. ఇదే వార్డు పరిధి మాణిక్యాంబ కాలనీలో కాలువ పునర్నిర్మాణ పనుల కోసం రూ.1.89 కోట్ల జీవీఎంసీ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు కూడా శ్రీకారం చుట్టారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అయినింటి రవికుమార్, వైఎస్సార్ సీపీ వార్డు సీనియర్ నాయకులు పిసాపాటి రవికుమార్, కూన ఢిల్లీరావు, షేక్ మస్తాన్, పిల్లి నాగరాజు, జె.ప్రశాంత్, పల్లా చైతన్య, బాబ్జీ, కె.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.